ఫైర్ స్టేషన్‌కు సొంత భవనం

- టీఎస్‌ఐఐసీ ఔదార్యం.. దాతల దాతృత్వం
- ఐదు దశాబ్దాలకు నెరవేరిన సొంత భవనం కల
- ఇండస్ట్రియల్ ఏరియాలో ప్రారంభోత్సవానికి సిద్ధం



ప్రారంభానికి సిద్ధమైన సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ సొంత భవనం

సనత్‌నగర్: గత ఐదు దశాబ్దాలుగా సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్న 'ఫైర్' సిబ్బందికి ఎట్టకేలకు ఊరట కలగనుంది. అప్పుడెప్పుడో 1960ల ఏర్పాటైన సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్‌ను ఆనాడు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇక్కడ పారిశ్రామిక కార్యాకలాపాలు మూడు పువ్వులు..ఆరు కాయలు అన్నట్లుగా విరాజిల్లుతూ వచ్చాయి. ఈ క్రమంలో అగ్ని ప్రమాదాలకూ ఆస్కారం లేకపోలేదు. దీని దృష్ట్యా ఇక్కడ ఫైర్‌స్టేషన్ సౌకర్యాన్ని కల్పించారు. అప్పట్లో ఈ ఫైర్ స్టేషన్‌కు అనుబంధంగా కూకట్‌పల్లి, మియాపూర్, బోరబండ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, బేగంపేట, బాలానగర్, షాపూర్, జీడిమెట్ల.. ఇలా సుదూర ప్రాంతాలు కూడా ఉండేవి. కాలక్రమేణా ఆయా ప్రాంతాల్లో కూడా ఫైర్ స్టేషన్లు అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం బాలానగర్, మూసాపేట, బోరబండ, మోతీనగర్, అమీర్‌పేట చుట్టుపక్కల ప్రాంతాలకు ఈ ఫైర్ స్టేషన్ సేవలు పరిమితమయ్యాయి. ఎక్కడైనా ఫైర్ తాలూకు ఛాయలు అలుముకున్నాయంటే చాలు..ఆగమేఘాలపై యంత్రాలతో ఫైర్ సిబ్బంది వెళ్లిపోతుంటారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలను సైతం పణంగా పెట్టి అగ్నికీలలకు ఎదురొడ్డి మరీ మంటలు ఆర్పి ఎంతో మంది ప్రాణ, ఆస్తులను కాపాడుతుంటారు. అలాంటి అగ్నిమాపక శకటాలు, ఫైర్ సిబ్బందికి సరైన వసతి సదుపాయం లేక నానా తంటాలు పడుతూ వచ్చారు.

మొదట ఓ షెల్టర్‌లో..

మొట్టమొదటిసారిగా ఇక్కడ ఫైర్ స్టేషన్‌ను ఒక ఫైరింజన్‌తో ప్రారంభించారు. అయితే అప్పటి ఓల్టాస్ కంపెనీలో షెల్టర్ ఇవ్వడంతో అక్కడి నుంచే కార్యకలాపాలు జరిగేవి. ఆ తర్వాత ఓల్టాస్ సంస్థ తన కార్యకలాపాలను నిలిపివేయడంతో ఫైర్‌స్టేషన్‌ను దాని ఎదురుగా గల భవనంలోకి మార్చారు. అయితే అది ప్రైవేటు వ్యక్తులకు చెందినది కావడంతో అద్దె చెల్లిస్తూ వస్తున్నారు. అలా దాదాపు 30 ఏళ్ల పాటు అద్దె చెల్లిస్తూ వచ్చారు. ఇంత చేస్తున్నా ఇక్కడ ఫైరింజన్లకు సరిపడా జాగా లేకపోవడంతో పాటు సిబ్బంది ఉండేందుకు సరైన నదుపాయాలు లేవు. కనీసం మూత్ర విసర్జన చేయాలన్నా బయటకు వెళ్లాల్సిన దుస్థితిని ఇక్కడ సిబ్బంది ఎదుర్కొన్నారు. ఇదిలా ఉండగా సనత్‌నగర్ ప్రధాన రహదారి విస్తరణ ప్రతిపాదనతో పాటు అమలుకు సిద్ధం కావడంతో ఇక్కడ ఫైర్‌స్టేషన్ ఉన్న భవనం కూడా రోడ్డు విస్తరణలో కోల్పోవాల్సి వచ్చింది. దీంతో గత్యంతరం లేక శకటాలు రోడ్డు మీదకు వచ్చాయి. ఇక సిబ్బంది ఉండేందుకు మాత్రం పారిశ్రామిక ప్రాంతంలోని టీఎస్‌ఐఐసీ కార్యాలయ భవనంలో ఉండేందుకు కనికరించారు. అప్పటి నుంచి ఫైరింజన్లు రోడ్డు మీద..సిబ్బంది వసతుల లేమితో టీఎస్‌ఐఐసీ భవనంలో ఉంటూ వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఒక ఎస్ఎఫ్ఓ, 2 డీఓపీలు, నలుగురు లీడింగ్ ఫైర్‌మెన్లు, ఇద్దరు హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు.

సొంత భవనం పూర్తి..

అగ్నిమాపక శాఖ అధికారుల ఎన్నో ప్రయత్నాలు, విజ్ఞప్తుల తదనంతరం ఎట్టకేలకు టీఎస్‌ఐఐసీ వీరి మొరను ఆలకించింది. ఫైర్‌స్టేషన్‌కు స్థలం ఇవ్వవచ్చన్న నిబంధన మేరకు ఇక్కడ 450 చదరపు మీటర్ల స్థలాన్ని కేటాయించింది. స్థలం అయితే ఇచ్చారు గానీ అగ్నిమాపక శాఖ నిధులు మంజూరు చేస్తుందా? లేదా..ఒకవేళ చేస్తే ఎప్పటికీ వచ్చేనో తెలియని పరిస్థితి. అదే సమయంలో కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ కింద ఫైర్‌స్టేషన్ భవనం నిర్మాణం చేపట్టేందుకు ముందుకువచ్చాయి. జీ ప్లస్ 1 భవనం నిర్మించారు. గ్రౌండ్‌లో రెండు పెద్ద అగ్నిమాపక శకటాలు, ఒకటి మధ్యస్థం, మరొకటి చిన్న శకటం పార్కింగ్ చేసుకునేలా తీర్చిదిద్దారు. పై అంతస్తులో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ (ఎస్ఎఫ్), గది, కాల్‌సెంటర్, స్టోర్‌రూమ్, సిబ్బంది వసతి ఉండేలా ఏర్పాట్లు చేశారు.

త్వరలో ప్రారంభిస్తాం..

సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ నిర్మాణం దాదాపుగా పూర్తయ్యింది. దీనిని త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అవసరమైన సౌకర్యాలన్నీ ఇక్కడ అందుబాటులోకి తీసుకువచ్చాం. సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్‌కు సొంత భవనం సమకూరడం ఆనందంగా ఉంది. ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దల సమయం కోసం వేచి చూస్తున్నాం. వారు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే ప్రారంభిస్తాం.

-డీఎఫ్ఓ మదుసూదన్‌రావు

ఆనందంగా ఉంది..



సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్‌కు ఇన్నాళ్లకు సొంత భవనం సమకూరడం ఎంతో ఆనందంగా ఉంది. దీని కోసం ఉన్నతాధికారులు ఎంతగానో ప్రయత్నాలు చేశారు. వారందరికీ తన కృతజ్ఞతలు. అలాగే నిర్మాణానికి సహకరించిన పలు సంస్థలు, స్థలం కేటాయించిన టీఎస్‌ఐఐసీకి ధన్యవాదాలు. తన హయాంలో ఇది అందుబాటులోకి రావడం ఆనందంగా ఉంది.

-ప్రదీప్, ఫైర్ ఆఫీసర్, సనత్‌నగర్

మంత్రికి నిరుద్యోగ సంఘం నేతల వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నేతలు

లాలాపేట: వయోపరిమితిని 50 ఏళ్లకు పెంచాలని కోరుతూ ఆదివారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్న ప్రభాకర్‌ను ఆదివారం నిరుద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యంతో దాదాపు 30 లక్షల మంది నష్టపోయినట్లు మంత్రికి వివరించారు. ఉద్యోగాల కోసం ఎంతో మంది నిరుద్యోగులు ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమాన్ని చేసినా గత ప్రభుత్వంలో ఉద్యోగాలు దక్కలేదన్నారు. రాష్ట్రంలో ఏర్పాటైన ప్రజా ప్రభుత్వంలో నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో శ్రీనివాస్‌రెడ్డి, దునుకు వేలాద్రి, వరంగల్ రవి, సుధాకర్ ఉన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న శేషుకుమారి

అమీర్‌పేట: అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని మున్సిపల్ మైదానంలో నిర్వహించిన తలసాని ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. రెండ్రోజుల పాటు జరిగిన పోటీలలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 40 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు.ఫైనల్‌లో విజయం సాధించిన జట్టుకు అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ శేషుకుమారి ట్రోఫీతో పాటు రూ.40 వేల నగదు, రన్నర్ జట్టుకు రూ.25 వేల నగదును అందజేశారు. యువత క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. బీఆర్ఎస్ నాయకులు కూతురు నర్సింహా, కట్ట బల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి



విద్యుత్ ఏఈతో చర్చిస్తున్న నాయకులు

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం లాలాగూడ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ రాజేష్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. తార్నాకలో జనవాసాల పైనుంచి వెళ్తున్న విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉందని, పలు కాలనీ, బస్తీల్లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలన్నారు. గత కొన్ని రోజుల నుంచి నెలకొన్న అప్రకటిత విద్యుత్ కోతలు, వినియోగదారులు, విద్యుత్ సిబ్బంది మధ్య తలెత్తుతున్న ఘర్షణ సంఘటనలు తదితర విషయాలపై చర్చించారు. లాలాపేట రోడ్డు విస్తరణతో రోడ్డు మధ్యలోకి వచ్చి ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిన స్తంభాలను తొలగించాలని కోరారు. ఏఈని కలిసిన వారిలో అమర్‌నాథ్ గౌడ్, బ్రహ్మజీ, శేఖర్, జాకీర, శైలందర్ ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న షేక్ నయీం

రసూల్‌పురా: కంటోన్మెంట్ రసూల్‌పురా గన్‌బజార్ కమ్యూనిటీహాల్లో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ, ఫస్ట్ సోర్స్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు షేక్ నయీం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్మాణ్ సంస్థ ప్రతినిధి డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ.. 324 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో అభినయ్, ఇంద్రభారతి, తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల అధ్యాపకుల సంఘం (టీడీఎల్ఎఫ్) 2024 కేలండర్‌ను ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబు టీడీఎల్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.కిశోర్‌కుమార్, అధ్యాపకులు డా.సంతోష్, సదానందంతో కలిసి ఆవిష్కరించారు.

'ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ ఉపకులాలకు న్యాయం'



ఎస్ఎస్‌పీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

చిలకలగూడ: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ, ఉపకులాల భవిష్యత్ ఆధారపడి ఉందని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) జాతీయ నాయకులు శామ్యూల్ మాదిగ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు టీవీ నర్సింహరావు అన్నారు. పార్శిగుట్ట న్యూఅశోక్ నగర్ కమ్యూనిటీ హాల్లో సికింద్రాబాద్ ఇన్‌చార్జ్ డప్పు మల్లికార్జున మాదిగ ఆధ్వర్యంలో జరిగిన బౌద్ధనగర్ డివిజన్ ఎంఎస్‌పీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అంశం చివరి దశకు చేరిందని, సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యులతో కూడిన అత్యున్నత ధర్మాసనం విచారణ చేపట్టిన నేపథ్యంలో మాదిగలంతా సంఘటితమై, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ నాయకత్వంలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాజన సోషలిస్ట్ పార్టీ బౌద్ధనగర్ డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పుల సాయికుమార్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా త్రినేత్ర, ప్రచార కార్యదర్శిగా రాజేష్‌ముదిరాజ్, రాజుమాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు శాంసన్‌మాదిగ, నాయకులు శ్రీనివాస్, రావుల యాదగిరి, శివప్రసాద్, శ్రీధర్, నవీన్, దినేష్, ప్రవీణ్, శ్రీరాములు, మహేష్, యాటరాజు, గణేష్ పాల్గొన్నారు.

'ఆదివారం అంగడి' సమస్యకు చెక్ పెట్టేలా చర్యలు



సబ్‌స్టేషన్ పక్కన మార్గాన్ని ఐరన్ షీట్లతో వేసిన ఫెన్సింగ్ వద్ద జెక్‌కాలనీ ఫెడరేషన్ ప్రతినిధులు



సబ్‌స్టేషన్ పక్కన కొనసాగుతున్న వ్యాపారాలు

సనత్‌నగర్: ఆదివారం అంగడి జెక్‌కాలనీలోకి చొచ్చుకు రాకుండా ఉండేలా కాలనీ ఫెడరేషన్ ప్రత్యేక చొరవ తీసుకుంటుంది. సబ్‌స్టేషన్ పక్క నుంచి కాలనీ హెచ్‌డీఎఫ్‌సీ రోడ్డులోకి రాకుండా ఐరన్ షీట్లతో ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. గత ఆదివారం 21న పోలీసు అధికారులు ఇక్కడికి వచ్చి వ్యాపారాలు చేసేవారితో పాటు కాలనీ ఫెడరేషన్ సభ్యులకు మార్గ నిర్దేశనం చేశారు. ఆ మేరకు ఈ ఆదివారం కాలనీ రోడ్ల పైకి ఎలాంటి వ్యాపారాలు జరకుండా నియంత్రించారు. ఇక్కడి సంత వ్యాపారులు కాలనీ రోడ్ల పైకి రాకుండా చర్యలు తీసుకోవాలంటూ గత కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులకు, అధికారులకు విజ్ఞప్తులు చేస్తూ వస్తున్నారు. కేవలం సంత సమస్య పరిష్కరించాలనే ప్రధాన డిమాండ్‌తో గత ఎన్నికల ముందు తలసాని శ్రీనివాస్‌యాదవ్ నిర్వహించిన సమావేశానికి ఇంటికొకరు చొప్పున హాజరై తమ ఐక్యతకు చాటారు. ఎమ్మెల్యే పలు విభాగాల అధికారులతో జెక్‌కాలనీ వాసుల సంత సమస్యపై చర్చించారు. పోలీసు, జీహెచ్ఎంసీ అధికారుల సూచన మేరకు ప్రధానంగా కాలనీలోకి సంత వ్యాపారులు ప్రవేశించే సబ్‌స్టేషన్ పక్కన మార్గాన్ని మూసివేయడంతో కాలనీ రోడ్ల పైకి రాకుండా వ్యాపారులను నిలువరించడంతో కాలనీ వాసులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.ఈ వారం పరిస్థితి కాస్త చక్కబడడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ చందు, ప్రతినిధులు శివారెడ్డి ఆదివారం దగ్గరుండి అక్కడి పరిస్థితులను సమీక్షించారు.

నేడు ఓయూకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాక

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి నేడు (29న) ఓయూ క్యాంపస్‌కు రానున్నారు. ఖేలో ఇండియా నిధులతో ఏ- గ్రౌండ్‌లో నిర్మించిన సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌ను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, వీసీ ప్రొ.రవీందర్‌తో కలిసి ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: లాలాగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని సీబీడీ ప్యారడైజ్ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు లంబాడీబస్తీ, కనకదుర్గ అపార్ట్‌మెంట్, సండే మార్కెట్, విజయ డైరీ, గరొండా అపార్ట్‌మెంట్, డేవిడ్ మెమోరియల్ కాలేజ్, విద్యానికేతన్, సెయింట్ ఆన్స్ జూనియర్ కాలేజ్, సెయింట్ జూడ్స్ కాలేజ్ ప్రాంతాలు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సండేమార్కెట్, నాగార్జుననగర్, షిరిడీ సాయి నగర్, శ్రీనివాస అపార్ట్‌మెంట్ పార్క్ ప్రాంతాలు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు డొమ్నిక్ మోడల్ హైస్కూల్ పోచమ్మ దేవాలయం, సాయి సదన్ అపార్ట్‌మెంట్, నారాయణ జూనియర్ కాలేజ్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

పర్యాటక కళ... రుచులు భళా

సాక్షి, సిటీబ్యూరో: చూసి తీరాలనిపించే ప్యాలెస్ అందాలు రుచి చూడాలని అనిపించే వంటకాలు.. ఆహూతులకు కొత్త అనుభూతి అందించాయి. తమ ప్రాంత పర్యాటక విశేషాలు తెలియజేప్పేందుకు గుజరాత్ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హోటల్ మేరీ గోల్డ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం ఆకట్టుకుంది. గుజరాత్ సంప్రదాయం ఉట్టిపడేలా చేసిన అలంకరణలు కనువిందు చేయగా, అక్కడి వంటకాలను పరిచయం చేసేందుకు నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ అతిథులకు చవులూరించింది. ఈ కార్యక్రమంలో గుజరాత్ పర్యాటక శాఖ అధికారులు కృపాకర్ పనిపాటి, శ్రీశాంతి కాలేజ్ ఆఫ్ మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు

ప్రజల ఆరోగ్య స్థితిగతులపై సర్వే

డాక్టర్ నిఖిలా

పద్మారావునగర్: ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోడానికి వీలుగా క్షేత్రస్థాయిలో సర్వే చేపడుతున్నట్లు బోయిగూడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ నిఖిలా వెల్లడించారు. ఈ నెల 29 సోమవారం నుంచి తమ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి వారి ఆరోగ్య స్థితిగతులను నమోదు చేస్తారన్నారు. ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించడానికి నిర్దిష్టమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు ఎవెల్లడించారు. క్షేత్రస్థాయిలో ఆశావర్కర్లు ప్రజల వద్దకు వెళ్లి వారి నుంచి వైద్య సమాచారాన్ని సేకరిస్తున్నారని చెప్పారు. చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలను గుర్తించి వారికి కావాల్సిన ఔషధాలు, ఇన్‌జక్షన్లను సకాలంలో అందిస్తున్నామన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.

'గాంధీ'లో ఆక్టోపస్ బలగాల మాక్ డ్రిల్



మాక్‌డ్రిల్‌లో ఆక్టోపస్ కమెండోలు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో ఆక్టోపస్ బలగాలు శనివారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆస్పత్రిలోకి చొరబడిన ఉగ్రవాదులు, అసాంఘికశక్తులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు ఆక్టోపస్ అధికారులు తెలిపారు. కమెండోలు, భద్రత బలగాలు, స్థానిక పోలీసులు పెద్దసంఖ్యలో ఆస్పత్రిలోకి చేరుకోవడంతో చికిత్స పొందుతున్న రోగులు, సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఆక్టోపస్ కమెండోలు, స్థానిక పోలీసులు, ట్రాఫిక్, అగ్నిమాపక ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

వినయ్‌కుమార్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ విద్యకళాశాల (కాలేజీ) పరిశోధన విద్యార్థి బొడ్డు వినయ్‌కుమార్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.రవీంద్రనాథ్ కే.మూర్తి పర్యవేక్షణలో సర్టెన్ ఫాక్టర్స్ రిలేటెడ్ టు స్టూడెంట్ ఎంగేజ్‌మెంట్-ఎ స్టడీ ఎమాంగ్ సీనియర్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

గద్దర్ విగ్రహ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

ఉస్మానియా యూనివర్సిటీ: సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో ఏర్పాటు చేయనున్న దివంగత నేత గద్దర్ విగ్రహ ఏర్పాటుకు మున్సిపాలిటీ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు విద్యార్థి నేతలు పేర్కొన్నారు. ఆదివారం ఏఐఎస్ఎఫ్ నెల్లి సత్య, ఆల్ మాల విద్యార్థి సంఘం (అంసా) ఓయూ అధ్యక్షులు నామ సైదులు, అధ్యాపకుడు డా. సుదర్శన్ తదితరులు తెల్లాపూర్‌లో కౌన్సిలర్ కొల్లూరి భరత్ ఆమరణ దీక్షలో పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ నెల 31న తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పరుగుల స్వామికి సన్మానం



స్వామిని సన్మానిస్తున్న ప్రవీణ్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: మారథన్ రన్నర్ చిన్నపాక స్వామిని బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సన్మానించారు. ఆదివారం స్టూడెంట్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 1000 రోజుల్లో 65000 కిలో మీటర్ల పరుగును పూర్తి చేసినందుకు సన్మానించినట్లు ఎస్ఎస్ఎఫ్ వ్యవస్థాపకులు సాగంటి రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, డా.శ్రీకాంత్, డా.కవిత, వేల్పుల సంజయ్, సతీష్, రమేష్ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి ఓటమే లక్ష్యంగా ప్రచారం చేస్తాం

తెలంగాణ మాల మహానాడు

ఉస్మానియా యూనివర్సిటీ: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి ఓటమే లక్ష్యంగా ప్రచారం చేయనున్నట్లు తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది తల్లమల్ల హసేన్ పేర్కొన్నారు. అనేక సమస్యలతో దేశం కొట్టుమిట్టాడుతుంటే పట్టించుకోని కేంద్ర మంత్రి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై దృష్టి పెట్టడం సిగ్గు చేటన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై గతంలో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికి కేంద్ర మంత్రి కోర్టు తీర్పును గౌరవించకుండా నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. కోర్టు తీర్పుతో ముగిసిపోయినా రిజర్వేషన్ల వర్గీకరణ అంశాన్ని మంత్రి కిషన్‌రెడ్డి ఎన్నికల సమయంలో రాజకీయాలకు అస్త్రంగా వాడుకోవడం దురదృష్టకరమన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీరు మారకుంటే మాల మహానాడు తగిన రీతిలో గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 13, పొడుగు వంకాయ 13, బెండకాయ 40, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 19, క్యారెట్ 18, దొండ 23, గుండుబీన్స్ 35, గింజ చిక్కుడు 28, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 23, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 60, మొరంగడ్డ 23, కందగడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఎంతకాలం ఎదురు చూపులు!

ఉద్యోగాల పర్మనెంట్‌పై కాంట్రాక్టు అధ్యాపకుల ఆశలు

ఓయూలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు ఉద్యోగాల పర్మనెంట్ కోసం 25 ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల్లో చేరిన కాంట్రాక్టు అధ్యాపకులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే పర్మనెంట్ అవుతాయని ఆశపడ్డారు. అందుకోసం ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో చివరి వరకు పోరాడారు. రాష్ట్రం ఏర్పడింది కానీ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలు పర్మనెంట్ చేయలేదు. అనేక పోరాటాల ఫలితంగా రాష్ట్రంలో ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నికల్ తదితర కాలేజీలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలను గత సీఎం కేసీఆర్ పర్మనెంట్ చేశారు. పోరాడి అలిసిపోయిన వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం ప్రత్యక్షంగా పాల్గొని ప్రచారం చేశారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ ఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయనే ఆశతో ఎదురు చూస్తున్నారు. - ఉస్మానియా యూనివర్సిటీ

ఆర్థిక భారం ఉండదు..



గత ప్రభుత్వం మా పైన కక్ష గట్టింది. ఇతర కాలేజీల్లో పని చేసే అధ్యాపకులను పర్మనెంట్ చేసి కేవలం వర్సిటీల అధ్యాపకులను విస్మరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కన్నా ప్రత్యేక రాష్ట్రంలోనే అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. ఓయూలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయడంతో ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం ఉండదు. -డా.ఆనంద్

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి..



ఓయూలో పని చేసే కాంట్రాక్టు అధ్యాపకులు పేద కుటుంబాల వారే. ప్రభుత్వం మా ఉద్యోగాలను పర్మనెంట్ చేస్తే యూనివర్సిటీ అభివృద్ధి పై దృష్టి పెడతాం. పర్మనెంట్ సిబ్బందితో కలిసి పని చేసినా వేతనాలు, అధికారాలు, ఇతర పనుల్లో వ్యత్యాసంతో ఇబ్బందులు పడుతున్నాం. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. -డా.తిరుపతి

మహిళలకు అన్యాయం



మహిళ అధ్యాపకులకు తీరని అన్యాయం జరుగుతోంది. పర్మనెంట్ సిబ్బందితో కలిసి పని చేసినా వారికి లభించే వేతనం, సెలవులు, ఇతర అలవెన్సులు లభించడం లేదు. వర్సిటీలలో విద్యార్థినుల సంఖ్య పెరిగింది. వారి సంఖ్యకు తగిన మహిళా అధ్యాపకులు లేరు. ప్రత్యేకంగా ఏర్పడిన తెలంగాణ మహిళ వర్సిటీలో కూడా అధ్యాపకుల కొరత ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం పర్మనెంట్ చేయాలని కోరుతున్నాం. -డా.వినితా పాండే